క్లుప్తంగా

వేంకటేశా.. గోవిందా..


వేంకటేశ్వరస్వామి స్వామి, అమ్మవార్లు

పెరవలి: శనివారం, ఏకాదశి కావడంతో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది భక్తులు తరలి రావడంతో స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. వందలాది మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. దాతల ఆర్థిక సహాయంతో సుమారు 5 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ఆలయంలో కొత్తగ స్వామివారికి పూల అలంకరణ, భక్తులకు ప్రసాదం పంపిణీ, నిత్య గోత్రార్చ, వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

భారీ అన్నసమారాధన

నిడదవోలు: గణపతి నవరాత్ర మహోత్సవాలు ముగిసిన సందర్భంగా పట్టణంలోని గణేశ్ చౌక్ సెంటర్లోని పూజా గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం వద్ద శనివారం భారీఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయి బాబు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిడదవోలు పరిసర ప్రాంతాల నుంచి తరలిచ్చిన సుమారు 10 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కన్వీనర్ కారింకి నాగేశ్వరరావు, సభ్యులు తోలేటి కోటేశ్వరరావు, సరిదే సత్యం, లక్కంసాని సూర్యారావు, ముప్పనబోయిన గంగారావు, దుళ్ల మురళి పాల్గొన్నారు.

నల్లజర్లలో దోమతెరల పంపిణీ


దోమతెరలు పంపిణీ చేస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు

నల్లజర్ల: డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి పలు వ్యాధులకు కారకమైన దోమకాటు నుంచి రక్షణకు ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు సూచించారు. ఆమెన్ ట్రస్ట్ తోడ్పాటుతో స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక నివసించే 50 కుటుంబాల వారికి శనివారం ఆయన దోమతెరలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధరరావు మాట్లాడుతూ దోమతెరలు ఇచ్చేందుకు స్వచ్ఛంద సంస్థ అమెన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఇవాంజలిన్ అశోక్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పలివెల ప్రసాద్, వైద్య ఉద్యోగుల సంఘ నాయకుడు జీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దంపతుల వైద్యానికి ఆర్థిక సాయం

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఈగల రవికుమార్, లోవలక్ష్మి దంపతుల వైద్య ఖర్చులకు పలువురు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామస్తులు, గ్రామ జనసేన పార్టీ శ్రేణులు గ్రామంలో విరాళాలు సేకరించి శనివారం రవికుమార్ దంపతులకు అందజేశారు. గ్రామం తరపున రూ. 42,000, జనసేన పార్టీ ద్వారా రూ.41,500, ఆ పార్టీ దేవరపల్లి శ్రేణులు రూ.17,600, మొత్తం రూ. 1,01,100 అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల వెంకటరత్నం, జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దావాల శ్రీనివాస్, దాసరి శేషు, టపా కోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన డిప్యూటీ తహసీల్దార్లు


ఎం.కమల్ సుందర్


టి. శ్రీనివాసరావు

చాగల్లు: సాధారణ బదిలీల్లో భాగంగా చాగల్లు వచ్చిన ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక తహసీల్దార్ ఎం.మెరికమ్మ ఆ వివరాలను వెల్లడించారు. ఏలూరు జిల్లా నుంచి పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌గా తురంగి శ్రీనివాసరావు, కొవ్వూరు తహసీల్దార్ కార్యాలయ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.కమల్ సుందర్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరారన్నారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో కొవ్వూరుకు జి.సత్యనారాయణ, దేవరపల్లికి బళ్లా శ్రీనివాసరావు, నిడదవోలుకు ఆర్‌జే సతీష్ బాబు నియమితులయ్యారు.


నల్లజర్ల మండలం, అనంతపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో..


పెరవలి అభయాంజనేయస్వామి గుడి వద్ద ..


గోపాలపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ..


దేవరపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ దుర్గారావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

ప్రజల దృష్టి మళ్లించేందుకు లడ్డూ డ్రామా

- సూపర్ సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- స్వార్థ రాజకీయాల కోసమే దుష్ప్రచారం
- ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ ఎమ్మెల్యే తలారి విమర్శ
- బాబుకు సద్బుద్ధి ప్రసాదించాలంటూ 108 కొబ్బరికాయలు కొట్టిన వెంకట్రావు
- ఆలయ ప్రాంగణం శుద్ధి


కొవ్వూరు బసివిరెడ్డిపేట వేంకటేశ్వరస్వామి ఆలయం మెట్లను శుభ్రం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: సూపర్ సిక్స్ హామీల అమలులో విఫలమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల దృష్టిని మళ్లించేందుకే తిరుమలలో లడ్డూ తయారీని తన స్వార్థ రాజకీయాలకు వాడుకోవాలని చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు విమర్శించారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించమని ప్రార్థిస్తూ తలారి శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి పట్టణంలోని బసివిరెడ్డిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. ముందుగా ఆలయ ప్రాంగణాన్ని వెంకట్రావు స్వయంగా నీళ్లతో కడిగి శుద్ధి చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆయన మాట్లాడుతూ శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడలేదని టీటీడీ ఈవో శ్యామలరావు ప్రకటించినప్పటికీ ప్రజలను పక్కదారి పట్టించే యత్నం చేయడం దారుణం అన్నారు. కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డూ పవిత్రతను దెబ్బతీసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడడాన్ని ఆ దేవుడు కూడా క్షమించడన్నారు. తన హయాంలో విజయవాడలో చంద్రబాబు 30 దేవాలయాలను కూల్చివేస్తే, ఆ తర్వాత అధికారం చేపట్టిన జగన్ మోహన్‌రెడ్డి వాటిని పునః నిర్మించారని తలారి గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, నాయకులు కంఠమణి రమేష్‌బాబు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, గంధం శేషసాయి, దేవగుప్తాపు లక్ష్మణరావు, బత్తి నాగరాజు, పరిమి సోమరాజు, తోట నారాయణ, పిక్కి శ్రీనివాస్, యజ్జల శ్రీనివాస్, వేంద్ర సూరిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, కౌన్సిలర్లు మద్దిపట్ల సాయిగీత, అంకోలు వెంకట లీల్లి పద్మలీల పాల్గొన్నారు.

పెరవలి: తిరుమల లడ్డూను కూడా రాజకీయం చేస్తున్న చంద్రబాబుకు సద్బుద్ధి ఇచ్చి, ఆయన పాపాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతూ పెరవలిలోని అభయాంజనేయ స్వామి వారికి వైఎస్సార్ శ్రేణులు శనివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పెరవలి శాఖ అధ్యక్షులు పంపన అంజనేయులు మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వరుని కూడా చంద్రబాబు తన స్వార్థ రాజకీయాలకు వాడుకోవడం దారుణం అన్నారు.కార్యక్రమంలో మణిబాబు, ఆ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరపల్లి: తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారనే అబద్ధపు ప్రచారంతో మహాపచారానికి పాల్పడుతూ భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ దేవరపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలోను, యాదవోలు గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలోను వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించాయి. దేవరపల్లిలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, యాదవోలులో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ లడ్డూ తయారీని చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి కోరినట్టుగా దీనిపై సీబీఐ చేత విచారణ జరిపించి వాస్తవాలను బయట పెట్టాలని దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కదలి హైమావతి, ఎంపీటీసీ సభ్యులు తమ్మిరెడ్డి నాగ ప్రసన్న, బొంతా చినబాబు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, ఎలికే నాగ శ్రీనివాస్, సత్తి సాయి ఈశ్వరరెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెలగా శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సద్బుద్ధి ప్రసాదించాలని ప్రార్థిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం గోపాలపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు అలవాటు పడిన చంద్రబాబుకు అందరూ అవినీతి పరులుగా కనిపించడం అలవాటుగా మారిపోయిందన్నారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ పడమట సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, ఇళ్ల భాస్కరరావు, ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి మండలంలోని వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ

నల్లజర్ల: తిరుమల పవిత్రతను, ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేశారని, ఆయన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం మండలంలోని వివిధ ఆలయాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశాయి. నల్లజర్లలో వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ ఆధ్వర్యంలో సక్కా పండు, ఆలపాటి సురేష్, అచ్యుత వెంకటస్వామి, తాడిగడప శ్రీనివాసరావు, చిక్కం గంగారావు, అల్లూరి చిన భాస్కరరావు, జోగినీడు నాగేశ్వరరావు తదితరులు ఈ పూజల్లో పాల్గొన్నారు. అనంతపల్లి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి గుడిలో ఎంపీపీ బంక జయలక్ష్మి అప్పారావు, కలం సత్యనారాయణ, జాదుల దుర్గారావు, ప్రత్తి మురళీకృష్ణ, చిట్లా వెంకటేశ్వరరావు, మీసాల అప్పలస్వామి తదితరులు పూజలు చేశారు. అలాగే ఘంటావారిగూడెం శివాలయంలో ఈలప్రోలు చంద్రరావు, జువ్వల పాలెపు అన్నవరం, కదలి దుర్గాప్రసాద్, గుత్తుల అప్పారావు, కరుటూరి సురేష్, కదలి రమేష్‌బాబు తదితరులు చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించాలని ప్రార్థించారు.

పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుదాం

- మంత్రి కందులు దుర్గేష్
- పట్టణంలో బేటీ బచావో- బేటీ పఢావో


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమాన్ని శనివారం స్థానిక తాలూకా రైస్ మిల్లర్స్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, అక్రమ రవాణా నివారణ మనందరి బాధ్యతన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణులకు సీమంతాలు చేశారు. మంత్రి దుర్గేష్ వారికి పోషకాహార కిట్లు, చీరలు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయ్‌కుమారి, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, తహసీల్దార్ బి.నాగరాజు, ఎంపీడీవో శామ్యూల్, డీసీపీవో రాజ్‌కుమార్, జనసేన పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రంగా రమేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నళిని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని జాగృతం చేసిన కవి జాషువా

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- 128వ జయంతి సందర్భంగా ఘన నివాళి


నిడదవోలులో గుర్రం జాషువా చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

కొవ్వూరు: తన అభ్యుదయ కవితలతో గుర్రం జాషువా నాటి సమాజాన్ని ఎంతో జాగృతం చేశారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం జంక్షన్ వద్ద గల జాషువా విగ్రహానికి ఎమ్మెల్యే పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రచనల ద్వారా బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం తీసుకు రావడమే గాకుండా దోపిడీదారులను చీల్చి చెండాడారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

నిడదవోలు: గుర్రం జాషువా 129వ జయంతిని శనివారం స్థానిక వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షురాలు పి.ఉషారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో తనకంటూ స్థానం ఏర్పరచుకొన్న అభ్యుదవి కవి గుర్రం జాషువా అన్నారు. సామాజిక అంశాలను రచనలుగా చేసి, కాదన్న వారితోనే తమ వాడని గర్వంగా చెప్పుకునే స్థాయికి జాషువా ఎదిగారన్నారు. ఆయన రచించిన 'గబ్బిలం' కావ్యం విశిష్టత గురించి ఉషారాణి విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. కంబయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లులో యువకుడి అదృశ్యం


మహ్మద్ ఇమ్రాన్ (ఫైల్)

చాగల్లు: స్థానికుడైన మహ్మద్ ఇమ్రాన్ అనే యువకుడు అదృశ్యమయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద నుంచి బైక్‌పై వెళ్లిన ఆ యువకుడు తిరిగి రాలేదు. దాంతో అతడి సోదరుడు సాదిక్ చాగల్లు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కె. నరేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా చాగల్లు శివారు నందమూరు రోడ్డులోని పేముల కాలువ వంతెనపై లభించిన బైక్ మహ్మద్ ఇమ్రాన్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ఇమ్రాన్ కోసం పేముల కాలువలో జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టారు. నిజంగా ఇమ్రాన్ పేముల కాలువలోకి దూకి గల్లంతయ్యాడా? లేక చెప్పులు, ద్విచక్ర వాహనం, మొబైల్ అక్కడ వదిలి వేరే ఎక్కడికైనా వెళ్లిపోయాడా? అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

పెరవలి: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైంది. పెరవలి ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముక్కామలకు చెందిన వనచెర్ల రాణి, తన ఇద్దరు కుమార్తెలు చంద్రిక (4), వాసంతి లక్ష్మి (17 నెలలు)లను తీసుకుని అజ్జరం గ్రామంలోని పుట్టింటికి వెళుతున్నానని చెప్పి శుక్రవారం ఉదయం బయలుదేరింది. కొన్ని గంటల తర్వాత ఆమె భర్త జానికిరాముడు అజ్జరం గ్రామంలోని తన అత్తవారింటికి ఫోన్ చేస్తే రాలేదని తెలిసింది. భార్యాబిడ్డల కోసం చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం ఉదయం జానికిరాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పెరవలి ఎస్ఐ అప్పారావు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు

కొవ్వూరు: స్థానిక 22వ వార్డుకు చెందిన తుమ్మలపల్లి శ్రీదేవి అనే మహిళ ఈనెల 22 తేదీ నుంచి కనిపించడం లేదు. దీనిపై ఆమె కుమార్తె విజయశ్రీ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.

20 మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

తాళ్లపూడి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. తాళ్లపూడి ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రక్కిలంకలోని టాక్సీ స్టాండ్ వద్ద గజ్జరం గ్రామానికి చెందిన కుంచాల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి శనివారం ఓ గోనె సంచిలో 20 మద్యం సీసాలు పెట్టుకుని అధిక ధరకు విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేసి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

పుష్కరాలకు ముందస్తు ప్రణాళిక

- సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ముప్పిడి ఆదేశం
- కొవ్వూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం


సమావేశం మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, చైర్ పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే అధికారులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. మున్సిపల్ సాధారణ సమావేశాన్ని శనివారం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, సుందరీకరణపై దృష్టి సారించాలన్నారు. గతేడాది కంటే 12.01 శాతం అదనంగా ఆదాయపు పన్ను వసూలు చేయాల్సి ఉండగా 8 శాతమే వసూలు చేశారన్నారు.ఈ కారణంగా మున్సిపాలిటీకి రావాల్సిన రూ.1.50 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచి పోయాయన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాల మేరకు పన్నులు వసూలు చేయాలన్నారు. అంచెలంచెలుగా పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అలసత్వం వల్ల లక్ష్యానికి కేవలం రూ.2 లక్షలు మాత్రమే ఆదాయపు పన్ను వసూళ్లలో వెనుకబడ్డామన్నారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో సమీక్షించి లక్ష్యాల మేరకు పన్ను వసూళ్లకు ప్రయత్నిస్తామని తెలిపారు.

డిగ్రీ కళాశాలకు ప్రత్యామ్నాయ స్థలం

22వ వార్డు కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు మాట్లాడుతూ పట్టణంలో డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని వాటర్ వర్క్స్ అవసరాలకు తీసుకున్నందున ప్రత్యామ్నాయంగా వేరొక చోట కళాశాలకు స్థలం కేటాయింపుపై దృష్టి సారించాలని కోరారు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఐదారు నెలలుగా తాగునీటి సమస్యలు తలెత్తుతున్నందున శాశ్వత పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని కోరారు. వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ వేములూరు సమీపంలోని జగనన్న కాలనీలోని పిల్లలకు ఒళ్లంతా దద్దుర్లు ఉన్నందున, అక్కడ వైద్య శిబిరం నిర్వహించాలని కోరారు. పట్టణంలో కుక్కల బెడద నివారణకు బడ్జెట్‌లో రూ.లక్ష కేటాయించినందున, వాటి నిర్మూలనపై కమిషనర్ శ్రద్ధ వహించాలని చైర్ పర్సన్ రత్నకుమారి సూచించారు. పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో బీసీ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటుకు సుముఖంగా ఉన్నారని కమిషనర్ టి.నాగేంద్రకుమార్ చెప్పారు. ఇందుకు మునిసి పాలిటీ స్థలాన్ని చూపించాల్సి ఉంటుందన్నారు.

అజెండా ఆమోదం

అజెండాలో ప్రతిపాదించినట్టుగా డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని వెనక్కి తీసుకోవాలని తీర్మానించారు. పారిశుధ్య ట్రాక్టర్లకు డీజిల్ బిల్లుల చెల్లింపునకు, వినాయక చవితి నిమజ్జన ఏర్పాట్లకు అయిన ఖర్చులు చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. హెడ్ వాటర్ వర్క్స్ నుంచి అచ్చాయమ్మ కాలనీకి పైప్‌లైన్ ఏర్పాటుకు అయిన ఖర్చులకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 22వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి, సర్ ఆర్థర్ కాటన్ విగ్రహం వద్ద డంపింగ్ యార్డుకు తాత్కాలిక గోడ నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

చిరుద్యోగులపై కూటమి సర్కార్ కక్ష సాధింపు

- దొమ్మేరులో మూడు రోజులుగా వీవోఏల నిరసన దీక్ష


దొమ్మేరులో నిరసన దీక్ష చేస్తున్న వీవోఏలు

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరులో పని చేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ యానిమేటర్స్ (వీవోఏ)పై కూటమి సర్కార్ కక్ష సాధింపులకు పాల్పడుతోంది. గ్రామంలోని తొమ్మిది మంది వీవోఏల్లో ఆరుగుర్ని తొలగించింది. దీంతో వారు గురువారం నుంచి గ్రామ శివాలయం వద్ద నిరసన దీక్షకు దిగారు. వారి ఆందోళన శనివారం మూడో రోజుకు చేరుకుంది. తాము 15 నుంచి 20 ఏళ్లుగా వీవోఏలుగా పని చేస్తున్నామన్నారు. పదేళ్ల పాటు జీతాలు లేక పోయినప్పటికీ స్వచ్ఛంద సేవలు అందించామని చెప్పారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు తమ బాధలు గుర్తించి రూ.8 వేల జీతం అందించారన్నారు. ఇప్పుడు కూటమి సర్కారు గ్రామ సంఘాల్లో ఎలాంటి తీర్మానాలు చేయకుండానే నిబంధనలకు విరుద్ధంగా తమను విధుల నుంచి తొలగించి, కొత్త వాళ్లను నియమించిందన్నారు. ప్రభుత్వం తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు. వీవోఏల దీక్షకు దొమ్మేరు పంచాయతీ సర్పంచ్ తానేటి కుమారి మద్దతు పలికారు. సాధనాల రత్నకుమారి, అల్లంకి పద్మావతి, బొల్లిపో మేరీ, చప్పటి సత్యవాణి, కొక్కిరిపాటి వెంకటరమణ, బొంతా మరియమ్మ దీక్షలో కూర్చున్నారు. వీరికి పలు డ్వాక్రా సంఘాల మహిళలు సంఘీభావం ప్రకటించారు.

ఆ ఇద్దరు ఎమ్మెల్యేలనూ అరెస్టు చేయాలి

పెరవలి: కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును, కాకినాడలో రంగరాయ వైద్య కళాశాల ప్రొఫెసర్‌పై దాడికి పాల్పడిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని అరెస్టు చేయాలని కోరుతూ బీఎస్పీ నిడదవోలు నియోజకవర్గ నాయకులు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో చల్లాబత్తుల సత్యనారాయణ, చిర్రా రాజు, బద్దా జాన్, శ్రీలక్ష్మి, సీహెచ్ రాంబాబు, పి. శ్రీనివాస్, వీరవల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వీడ్కోలు సన్మానం

నిడదవోలు: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కొప్పర్తి శ్రీరామ్‌కుమార్ మైదుకూరు ఆర్టీసీ డిపోకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శనివారం డిపో వద్ద మేనేజర్ శ్రీరామ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

మార్చిలోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

నల్లజర్ల: లబ్ధిదారులు చేపట్టిన గృహ నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ఎంపీడీఓ సింహాద్రి సూచించారు. 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పుల్లలపాడులో గృహ లబ్ధిదారులతో శనివారం ఆయన సమావేశమై మాట్లాడారు. పీఎంఏవై కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుంటే మార్చి తర్వాత అవి రద్దు చేయబడతాయన్నారు. వాటికి కేంద్ర ప్రభుత్వ సాయం పెంచబడదన్నారు. గృహ నిర్మాణశాఖ ద్వారా అందించే ఇసుక, సిమెంట్ వంటి మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.